# మరణ శాసనం



ఎస్. గోవింద రాజులు

―శేఖర్.

''ఏమేవ్ కావుడూ ఇలారా !'' ఆ యా స పడుతూ పిల్చింది పిచ్చమ్మ.

''ఎందుకూ ?'' విసుక్కుంటూ వచ్చింది.

''రావుడు ఏడీ...?''

''బయట అరుగుమీద కూర్చున్నారు.''

''అన్నం తిన్నాడా ?''

''లేదు...''

''అదేమీ, వాడికి యింకా విస్తర వేయ లేదూ !''

''మధ్యాన్నం భోక్తగా వెళ్ళారు. తరువాత కాసిన పాలు కాచి యిస్తాను'' అంది.

''ఇదో ! నాకు ఏమీ వద్దుగానీ... యీ రోజు తిధి నక్షత్రం బావుందంటావా !''

''ఆఁ బాగానేవుందిగానీ... కాస్త కన్ను మూయకూడదూ !'' విసుగ్గా అంది.

''మూస్తానే ! ఏకంగా ఒకేసారి మూసే యాలనికదూ యీ తాపత్రయం. పోయేప్రాణం కాస్త మంచి ఘడియలలోనైనా పోతే మంచిదని.. యింత బ్రతుకూ బ్రతికీ... అ వు నూ... విశాలాక్షి దాని పిల్లలు రారేం...?''

''అయ్యో ! ఖర్మ... విశాల వదిన పెద్ద కూతురు లక్ష్మికి యీ తెల్లవారు ఝామున పెండ్లిగా'' అంది.

''అవును కదూ ! మరిచాను. ఆ పిల్ల ముండకి పెండ్లి కావాలని పాపం విశాల తపించి పోయింది. నిర్విఘ్నంగా జరగని'' అని మనసారా కోరుకుంది.

విశాలాక్షి తలుపులు తోసుకొని పాత్రలతో వచ్చింది.

భక్ష్యాలు వున్నాయి అందులో.

''ఎవరూ విశాలా ! ఏమే కూతురు పెండ్లికి తపించిపోయావు ఆఖరకి చేస్తున్నావా ?''

''అవును పిన్నీ...అంతా నీ ఆశీర్వాదం. పిన్నీ... హల్వ తెచ్చాను. కాస్త నీవు నోట్లో వేసుకుంటే నాకు తృప్తి'' అంది గిన్నెసి ఆమె ముందు పెట్టి.

''నాకు మాత్రం సంతోషం కదూ ! వేలు డంత వెర్రిముండకి పెండ్లి అంటే. బామ్మా బామ్మా అని నా వెంట వెంట తిరిగేది. ఏది వుసిరికాయంత ఈ అరచేతిలో వెయ్యి'' అని చెయ్యి చాచింది.

విశాలాక్షి నిమ్మకాయింత వేసింది. దాన్ని నోట్లో వేసుకొని చప్పరించి ''పాకం యింకా కొంచెం రావాలే విశాలా'' అని అంది.

''బాగా చెప్పావు పిన్నీ'' అని కామేశ్వరి వేపు తిరిగి ''వదినా! ముహూర్తానికి పందిట్లోకి వచ్చి అన్నయ్యా నీవూ అక్షింతలు వేయండి. మీ ఆశీర్వాదమే దానికి శ్రీరామ రక్ష'' అంది కంట తడిపెడుతూ.

''వస్తాలే వదినా ! నీవు దిగులుపడకు''అని కామేశ్వరి అంది.

''పిన్నీ వస్తాను. ముహూర్తం అయిన తరువాత పిల్లనీ పిల్లాడినీ తీసుకొస్తా'' నని వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయింది.

*  *  *

పిచ్చమ్మ బ్రాహ్మలావిడ. ఒక కొడుకు పుట్టిన తరువాత భర్తపోయాడు. అప్పటినుండి నీళ్ళుమోసి, అప్పడాలు వత్తి, వంటలుచేసి కొడుకుని పెంచింది.

ఎప్పుడో పాతికేళ్ళ క్రితం చిన్న పాక వెలకి వస్తే తను దాచుకుందిగాక, తనువంటచేసే యజమానురాలిని అడిగి కొంత పైకం తీసుకొని నెత్తిన గూడు ఏర్పరచుకుంది.

పిచ్చమ్మ కష్టజీవేగాక, పరోపకారి కూడా. తనకి లేకపోయినా యితరులకి యింత అయినా పెట్టాలన్న ధర్మగుణం మెండుగా వుంది.

తన శరీర కష్టంతో కూడా యితరులకి ఎంతో సహాయం చేసేది.

ఇరవై సంవత్సరాల క్రితం విశాల మూడేళ్ళ కూతురు, వెర్రిబాగుల పెనిమిటితో బ్రతకడానికి ఆ వూరు వచ్చి దేవుడు చెప్పి పంపినట్లు పిచ్చమ్మ యింటి వాకిలి ముందు నిలబడి బిడ్డకి పిడికెడు అన్నం అడిగింది.

చూడగానే గ్రహించింది పేద బ్రాహ్మణ కుటుంబం అని.

ఆదరించి కూర్చోపెట్టి, విస్తరివేసి తన కున్నదే వారికి కడుపునిండా పెట్టి ఆదరించింది.

విశాల తన కష్టం చెప్పుకుంది. మొగుడు వెర్రివాడు. తెలియక తల్లిదండ్రులు కట్ట బెట్టారు. అత్తగారూ వంటలు చేసి బ్రతుకు తుంది.

పెండ్లి అయిన మరు వుదయమే నీ బ్రతుకునీది అనేసి ఆవిడ మారు చీర తీసుకొని తన పనిలోకి వెళ్ళిపోయింది. వెర్రివాడిని తనకి అప్పగించి చేతులు దులుపుకుంది.

ఈ నాలుగేళ్ళు వున్న వూరిలో నానా కష్టాలు పడింది. ఇప్పుడు ఇలా వచ్చింది.

''అయ్యో పాపం ! ఎన్ని కష్టాలు పడ్డావే పిచ్చితల్లి. నిన్ను నా బిడ్డగా చూచుకొంటాను, నా పంచలోనే ఓ మూల పడివుండు. వయస్సు వేసుకొని వెర్రివాడితో ఎక్కడని తిరగగలవ్'' అని ఆదరించింది.

ఆ చిన్న తాటాకు యింటిలోనే మధ్య తడిక వేయించి వాళ్ళు వుండేట్లుగా దానికి ఏర్పాటు చేసింది.

తనతో బాటే నీళ్ళమోతకి, అప్పడాలు వడియాలు పెట్టడానికి, వంటలకి తీసుకొని వెళ్ళి బ్రతికే మార్గం చూపించింది.

విశాల భర్త చయనులు ఒక్కొక్కసారి బుద్ధిగా వుండేవాడు. ఒక్కొక్కసారి రాగిచెంబు పుచ్చుకొని యాయవారానికి వెళ్ళేవాడు.

ఈ రెండు చేసిన రోజున విశాలకి గానీ పిచ్చమ్మకి గానీ, ఆమె కొడుకు రామచంద్రకిగానీ నెమ్మదిగానే వుండేది.

అలా వుండని నాడు వీధిలో చెత్త అంతా యింట్లో పోగేసి— ''ముండకానా ! యిల్లు యిలా పెట్టి నీవెక్కడకి వెళ్ళావే'' అని జుట్టు పుచ్చుకొని కొట్టడానికి వచ్చేవాడు.

లేదా యింటికి అలసి వచ్చిన భార్యతో ''ఏమేవ్ ! నీళ్ళకుండలో నే మూత్రం పోశా ! నీ కిష్టం అయితే ఆ తీర్థం పుచ్చుకో !'' అనేసి ప్రక్కయింటికి వెళ్ళి— ''కాస్త తీర్థం యిస్తారా! మా యింటావిడో వెర్రిబాగుల ముండ, నీళ్ళ కుండలో మూత్రం పోసి వుంచింది'' అని మంచి నీళ్ళు అడిగి తాగేవాడు.

నిజంగా ఆ పని చేశాడో లేదో తెలియదు. చెప్పిన తరువాత ఆ కుండని ఎలా వుపయోగిం చడం ! పారవేద్దామంటే ఎన్ని కుండలని కొన గలదు ?

ఇలా ఎన్నెన్నో పనులు చేసేవాడు. విశాలతో బాటూ చయనులని పిచ్చమ్మ, రామచంద్రా భరించారు.

అలానే బ్రతుకుని లాక్కొని వస్తున్నారు. ఒక్క గదిని చెమటోర్చి రెండు గదులని చేసి వెనక వసారాలా వాల్చారు వంటకని. ఒక గదిలో పిచ్చమ్మ కుటుంబం, యింకొకటి విశాలది.

రామచంద్రకు నలుగురు కొడుకులు. రామచంద్ర తల్లి వృత్తినే స్వీకరించాడు.

కొడుకులు పట్నంవెళ్ళి అక్కడ హోటళ్లల్లో వంటవాళ్ళుగా వున్నారు.

విశాల కూతురు లక్ష్మికి పాతికేళ్ళు. పెండ్లి కాలేదని ఎన్నో నోములు వ్రతాలు కూతురితో చేయించింది. రోజూ మూడు పూటలూ లలితా స్తోత్రం చదివించేది.

తనలా తన కూతురు బాధ పడకూడదని విశాల ఆశ. చివరకి ఏదో కుదిరింది.

తన యింటిలోనే నలుగురిని పిలిచి పెండ్లి చేస్తోంది.

పెండ్లివారూ అంతంత మాత్రమే.

బాజాలు భజంత్రీలు ఓహో అని పెట్టక పోయినా, శాస్త్రోక్తంగా మంత్రాలతో చేయడానికి అడ్డులేదు కదా !

అది అయినా నాలుగు యిళ్ళవాళ్ళ సహాయం దయతో చేయబట్టి యిది అయినా చేయగలుగుతోంది.

''కావుడూ...కావుడూ... '' ఆయాసంగా పిల్చింది పిచ్చమ్మ.

మాగన్నుగా నిద్రలో వున్న కామేశ్వరి లేచి ''అత్తా పిల్చావా ?'' అంది.

''అవునే... దాని పెండ్లి అయిపోయిందా?'' అని అడిగింది.

''ఇంకా ఎక్కడా ? అది తెల్లవారు ఝాము లగ్నం. యింకా అర్థరాత్రి దాటలేదు'' అంది.

''రావుడేడి ? వాడిని పిలవ్వే'' అంది.

''ఏమండి మీ అమ్మ పిలుస్తోంది'' అని భర్తని తట్టిలేపింది.


ఓ పదిహేను రోజులుగా పిచ్చమ్మ పరిస్థితి బాగోలేదు. ఏ క్షణాన పోతుందో అని అందరూ అనుకుంటూనే వున్నారు.

అయినా మాటామంతీ అంతా చాల తెలివిగానే వుంది.

పెద్దది వూరికి ఎంతో వుపకారం చేసింది అని వాడకట్టు వారంతా పండో ఫలహారమో చేసి తెచ్చి పిచ్చమ్మకి యిచ్చి నమస్కరించారు.

అందరినీ మనసారా దీవించింది.

తల్లికి ప్రాణం బాగోలేదని రామచంద్రా, కామేశ్వరి యింటి లోపలే వున్నారు. లేదంటే పెండ్లి పందిట్లోనే వుండేవారు.



''రావుడూ! తులసీ తీర్థం కాస్త గొంతుకలో పోయూరా'' అంది.

ప్రక్కనే సిద్ధంగా వుంచిన తీర్థాన్ని నాలుగు చెంచాలు తల్లి గొంతుకలో పోశాడు.

అది గుటకవేసి -

''కావుడో వెర్రి బాగులది. దాన్ని కట్టుకోవడం యిష్టంలేక దానిని నీవు ప్రేమగానే చూడలేదు. అన్న కూతురు. తల్లిలేని పిల్లకదా అని నేను కడుపులో పెట్టుకుంటే నీవు అలా చేశావ్.

ఏమీ కావుడూ! పిచ్చిముండా! నీకేంలోటే బంగారంవంటి కొడుకులని నలుగురిని కన్నావ్. ఒక కొడుకు కొడుకా ఒక కన్ను కన్నా అన్నారు పెద్దలు. అయినా ఆ ఒక్కకొడుకు చేతిమీద నేను లక్షణంగా వెళ్ళిపోతున్నా.

నలుగురు కొడుకులు వున్న నీవు అదృష్టవంతురాలివే. హాయిగా నీ కాలం వెళ్ళిపోతుంది. దిగులు పడకూ!

కావుడూ! ప్రాణం ఎగిరిపోయేలాగుంది, కాస్త ఆ వెర్రిముండ లగ్నం అయ్యేవరకూ గుట్టుగా వుంచండే. అది పెండ్లో అని వెంపర్లాడిపోతుంది. ఆ మూడు ముళ్ళు పడి అది కాస్తా అత్తగారి యింటికి వెళ్ళి పోయేవరకూ ... దుఃఖాన్ని దిగమింగుకోండి. శవాన్ని బయటికి తీయవద్దు...

హంస ఎలానూ ఎగిరిపోతుంది. పోయేదాని కోసం నూరేళ్ళు బ్రతికేదాన్ని కంట తడి పెట్టించడం ఎందుకూ?

'బామ్మా బామ్మా' అని వెర్రిముండ నా చుట్టూనే తిరిగేది. అది వినిందంటే తట్టుకోలేదు.

# మరణ శాసనం

కావుడూ నా సందూక పెట్టె తీవే'' అంది.

కామేశ్వరి ప్రక్కనే వున్న పెట్టెని అందించింది.

''రావుడూ! కావుడని బాధ పెట్టకురా'' అంది.

రామచంద్ర పచ్చగా అందంగా వుంటాడు. కామేశ్వరి ఛాయ తక్కువలో చాల పొట్టిగా పిలకజుట్టుతో వుండేది. ఆ పిల్లని చూసి తనకి వద్దని ఏడ్చాడు.

అన్న కూతురే దానిని ఎవడు కట్టుకుంటాడని పిచ్చమ్మ కొడుక్కి చేసుకుంది.

కామేశ్వరిని చూస్తే మండిపడేవాడు. అందుకే ప్రక్కదారులబడి పోయేవాడు.

తను సంపాదించినదంతా ఆడవారి కోసమే ఖర్చు చేసేవాడు.

పిచ్చమ్మ మాత్రం ఏం చేయగలదు? కోడలని తనతో త్రిప్పి సంపాదనాపరురాలని చేసింది.

ఎలానో నలుగురి పిల్లలకి తల్లి అయింది.

వయస్సు కావడంవలనగానీ, రోగాలు అంటుకోవడం వలనగానీ రామచంద్రం వ్యవహారాలని తగ్గించుకున్నాడు.

అందుకే ఆవిడ బాధపడుతోంది కోడలు కోసం.

''నేనెందుకు బాధ పెడతానే. నాకు మాత్రం ఎవ్వరున్నారు కావుడు తప్పా'' అని అన్నాడు. ఆ మాటకి ఆవిడ హృదయం పొంగిపోయింది.

''ఆ విశాల నీ చెల్లెలు ఏంటిదిరా. దాని ప్రాణం వున్నంత వరకూ దానిని యీ పంచలోనే వుండనీయండి'' అని అంది.

''సరేలే''

''ఇదిగో! నా చావు ఖర్చులకి ఓ ఐదు వందలు దాచి వుంచాను. దానితో చెయ్యి, కావుడూ! నా పెండ్లికి మా అమ్మా నాన్న యిచ్చిన ఏడురాళ్ల దిద్దులు యివి. దాచుకో! ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని నేను అమ్మలేదు. వాటిని చూస్తే మా అమ్మా నాన్నా గుర్తుకు వస్తారు. ఆ దిద్దులని కంసాలి యింటి నుండి తేవడంకోసం మీ నాన్నని నేను పోరేదాన్ని. మా అన్న రోజూ వెళ్లి వచ్చేవాడు. అది తెచ్చినరోజున మా అన్న అంటే మీ నాన్న నన్ను తెగ ఏడిపించాడు.

వాటిని చూస్తే...'' ఆయాసం. కామేశ్వరి నోట్లో కాస్త పాలు పోసింది.

గుర గుర శబ్దం వస్తూ వుంది.

ఘడియలని చూసింది. బాగానేవుంది.

గురక ఆగిపోయింది.

బయట మంగళ వాయిద్యాలు ప్రారంభం అయాయి.

రామచంద్రకి దుఃఖం వచ్చింది.

తల్లికిమాత్రమే తెలుసు. తను ఎన్ని వెధవ పనులు చేసినా కడుపులో పెట్టుకొని దాచుకొంది.

ఆ తల్లి అండ తనకిలేదు. ఆ తల్లి మరణిస్తే కూడా కరువుతీరేలా ఏడ్చే అదృష్టం కూడాలేదు.

పెండ్లి అయ్యే వరకూ ఏడవవద్దని శాసించింది.

కామేశ్వరికీ అలానే వుంది—

అత్తా...అత్తా అని ఏడవాలని.

తల్లి తరువాత తల్లిగా చూచిన అత్త. భర్త అనాదరణ ఎంత వున్న, అత్త ఆదరణ అపారంగా వుండటం వలన బ్రతకగలిగింది.

ఆ అత్త యింక లేదు.

అయినా ఏడ్చే అదృష్టం లేదు.

రామచంద్ర ముసుగు కప్పుకుని ముడుచుకొని ఓ మూల కూర్చున్నాడు.

కామేశ్వరి మొహానికి చెంగు కప్పుకొని కూర్చుంది.

పెండ్లి ఎప్పుడు అవుతుంది?

అంపకాలు ఎప్పుడు పూర్తి అవుతాయా—?

కరువుతీరా ఎప్పుడు ఏడుద్దామా అని.

బయట పెండ్లి తంతు జరుగుతూ వున్నది.

పిచ్చమ్మ 'మరణ శాసనం' వుల్లంఘించలేదు ఆమె కొడుకు. ★

